# సార్లూ... జర పట్టించుకోండి

హయత్‌నగర్ (వాయిస్ టుడే)

పట్టణాభివృద్ధి ప్రణాళికల్లో తమ కాలనీని పూర్తిగా విస్మరిస్తున్నారని వర్ధనగర్ కాలనీవాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమ్యూనిటీ హాల్, ప్రహరీగోడ నిర్మాణం, అంతర్గత రహదారుల వంటి మౌలిక వసతుల కల్పనపై ఎన్నికల సమయంలో భారీ హామీలు ఇచ్చిన నేతలు, ఎన్నికల అనంతరం "చూద్దాం... చేద్దాం" అంటూ కాలక్షేపం చేస్తూ సమస్యలను పూర్తిగా పట్టించుకోవడం లేదని వర్ధనగర్ కాలనీవాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

హయత్‌నగర్ సర్వే నంబరు 181, 181 పార్ట్‌లో వర్ధనగర్ కాలనీ లే అవుట్‌లో ఓపెన్ స్పేస్‌గా 200 గజాలు, మరోచోట 900 గజాలు కేటాయించారు. కాలక్రమేణా 200 గజాల ఓపెన్ స్పేస్ పూర్తిగా ఆక్రమణకు గురికాగా, 900 గజాల్లో కొంతభాగం ఆక్రమించబడింది.

ఈ నేపథ్యంలో స్థలాలను రక్షించుకోవడమే కాకుండా, శుభకార్యాలు, పండుగలు, ఉత్సవాలు నిర్వహించడంతో ప్రజల మధ్య సౌహార్ద్రాన్ని పెంపొందించేందుకు కమ్యూనిటీ హాల్ ఉపయోగకరమని భావించిన కాలనీవాసులు, కమ్యూనిటీ హాల్, దాని ప్రహరీగోడ, పోచమ్మ తల్లి గుడి నిర్మాణం చేయాలని నిర్ణయించారు.

ఆ నిర్మాణాలు చేసి స్థలాలు రక్షించాలని కాలనీవాసులు దశాబ్దాలుగా ప్రభుత్వ అధికారులను, స్థానిక ప్రతినిధులను పలుమార్లు కోరినా స్పందన కరువైంది. ఎన్నికల సమయంలో లేదా కాలనీ ఉత్సవాలకు వచ్చినప్పుడు, స్థానిక ప్రతినిధులు "చేస్తాం, చేయిస్తాం" అంటూ హామీలు ఇచ్చినా, వాస్తవ చర్యలు మాత్రం తీసుకోలేదు.

ఈ నేపథ్యంలో "ఎవరో వస్తారని ఏదో చేస్తారని, ఎదురు చూసి మోసపోకుమా, నిజం మరచి నిదురపోకుమా" అన్న మహాకవి శ్రీశ్రీ మాటలను స్ఫూర్తిగా తీసుకుని, హయత్‌నగర్‌లోని వర్ధనగర్ కాలనీవాసులు స్థలాల రక్షణ, అభివృద్ధి పనులకు నడుం బిగించారు. కాలనీవాసుల విరాళాలతో రూ. 5 లక్షలు సమకూరగా, ఆ నిధులు కమ్యూనిటీ హాల్, ప్రహరీగోడ నిర్మాణ కట్టుబడికి మాత్రమే సరిపోయాయి. ప్లాస్టరింగ్ తదితర పనులు ఆగిపోగా, వాటి కోసం ప్రభుత్వం సహాయం చేస్తుందనే ఆశతో కాలనీవాసులు ఎదురు చూస్తున్నారు. ఎంతో వ్యయప్రయాసలకోర్చి నిర్మించిన కట్టడాలకు ప్లాస్టింగ్ చేయక పోవడంతో, వర్షాలకు నానిపోయి కూలిపోతాయనే భయంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం స్పందించి ఆగిపోయిన నిర్మాణాలను పూర్తిచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. అలాగే, కమ్యూనిటీ హాల్‌లో ఉదయం వాకింగ్ చేసేందుకు వీలుగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కూడా కాలనీవాసులు కోరుతున్నారు. కమ్యూనిటీ హాల్‌కు బోర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయిస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఆ హామీని నిలబెట్టుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. అలాగే కాలనీవాసులు కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకుని, మనస్ఫూర్తిగా విరాళాలు ఇవ్వాలని కాలనీ అసోసియేషన్ మరియు కాలనీ పెద్దలు కోరుతున్నారు.

## అంతర్గత రోడ్లు లేక అవస్థలు

లక్షల రూపాయలు ఖర్చు చేసి ఆధునిక సౌకర్యాలతో ఇళ్లు నిర్మించుకున్నా, కాలనీలో అంతర్గత రహదారుల లేమి ప్రధాన సమస్యగా మారింది. వర్షాకాలంలో మట్టి రోడ్లలో గుంతలు ఏర్పడి, రోడ్లు చిత్తడిగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నా సీసీ రోడ్లు నిర్మించడంలో విఫలమవుతోందని కాలనీ వాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కాలనీ అంతర్గత రోడ్లు నిర్మించాలని కోరుతున్నారు.

## అస్తవ్యస్థ పారిశుద్ధ్య నిర్వహణ

కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా అస్తవ్యస్థంగా మారింది. రోడ్ల ఇరువైపులా, ఓపెన్ ప్లాట్లలో, కాలనీల మలుపుల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే కనిపిస్తున్నాయి. దీనివల్ల దుర్వాసన వ్యాపించడమే కాకుండా, దోమలు, కీటకాలు ప్రబలిపోతున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో వారానికి ఒకసారి కూడా శుభ్రపరిచే పని జరగడం లేదు. అలాగే చెత్త సేకరణకు ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు అంటున్నారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



కాలనీలోని రోడ్ నంబరు 6, 5, కమ్యూనిటీ హాల్ ఎదురుగా ఉన్న రోడ్డు, రోడ్ నంబరు 4 అడ్డరోడ్డు. మధ్యలో ఆగిపోయిన కమ్యూనిటీ హాల్, ప్రహరీగోడ, పోచమ్మ తల్లి గుడి.



# ఎమ్మెల్సీ కవిత పోరాటంతోనే రెండు వేరువేరు బిల్లులు పెట్టిన ప్రభుత్వం

**ఇది తెలంగాణ జాగృతి సాధించిన మరో భారీ విజయం.**

**బీసీల పక్షాన పోరాటం చేసిన ఎమ్మెల్సీ కవితకు ధన్యవాదాలు తెలిపిన బీసీ నేత ఆర్ వి మహేందర్.**

గోషామహల్, మార్చ్ 18(వాయిస్ టుడే): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పోరాట ఫలితంగానే బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు పెంచడానికి రెండు వేరువేరు బిల్లులను ప్రవేశ పెట్టిందని గోషామహల్ ఇంచార్జ్ ఆర్ వి మహేందర్ స్పష్టం చేశారు. బీసీల కోసం ఎమ్మెల్సీ కవిత చేసిన ఉద్యమానికి ప్రభుత్వం తలొగ్గిందని, అందుకు ఎమ్మెల్సీ కవితకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇది తెలంగాణ జాగృతి సాధించిన మరో భారీ విజయంగా అభివర్ణించారు. సుదీర్ఘకాలంగా ఈ దేశంలో అన్ని రకాల అన్యాయాలకు గురైన బీసీ సోదరులకు రిజర్వేషన్ల కోసం విద్యా, ఉపాధి, రాజకీయ రిజర్వేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రెండు వేర్వేరు బిల్లులను ప్రవేశ పెట్టడం స్వాగతిస్తున్నామని తెలిపారు. విద్యా ఉపాధి రాజకీయ రిజర్వేషన్లకు కలిపి ఒకే బిల్లు పెడితే బీసీలకు అన్యాయం జరుగుతుంది అని ముందే గుర్తించి వేరువేరు బిల్లులు పెట్టాల్సిందే అని డిమాండ్ చేసినది కేవలం జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత మాత్రమే అని గుర్తు చేశారు. మండల్ కమిషన్ రిపోర్టును తొక్కి పెట్టింది మొదలు కులగణన డెడికేటెడ్ కమిషన్ కాకుండా రెగ్యులర్ కమిషన్కు ఇచ్చేవరకు కాంగ్రెస్ ది ద్రోహ చరిత్ర అని అన్నారు. బీసీల సంఖ్య తక్కువగా చూపెట్టినప్పటికీ బీసీ సంఘాల మరియు తెలంగాణ జాగృతి వంటి సంస్థల ఒత్తిడి ఉద్యమంతోనే బీసీ రిజర్వేషన్లు కొలిక్కి వచ్చాయని అన్నారు. బీసీల కోసం బీసీలు మాత్రమే మాట్లాడాలనే కొందరి వాదన బీసీల గొంతును బలహీనపరచాలనే కుట్ర మాత్రమే అని ఆయన అన్నారు. బాధితుల పక్షాన అణగారిన వర్గాల పక్షాన ఎవరు గొంతు ఎత్తినా స్వాగతించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. సంపూర్ణంగా 42% బీసీ రిజర్వేషన్లు అమలయ్యే వరకు బీసీలు జాగ్రత్తతో ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. బిల్లులు పాస్ అవుతున్న ఈ కీలక దశలో కేంద్రం మీద ఒత్తిడి పెంచేందుకు బీసీలు సిద్ధంగా ఉండాలని ఆర్ వి మహేందర్ పిలుపునిచ్చారు.



# శ్రీ స్వామి వారిని మిస్ యూనివర్స్ విక్టోరియా క్జార్ థెయిల్విగ్ దర్శించుకున్నారు

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట : ఈవో భాస్కరరావు కార్యనిర్వాహణాధికారి వారికి దర్శన ఏర్పాట్లు గావించి దర్శనం అనంతరము శ్రీ స్వామి వారి ఫోటో, ప్రసాదము అందజేసియున్నారు. అనంతరము మిస్ యూనివర్స్ విక్టోరియా క్జార్ థెయిల్విగ్ ఆలయ విశిష్టత,ఆలయ సంప్రదాయము మొదలగువివరములు శ్రీయుతకార్యనిర్వాహణాధికారి వారిని అడిగి తెలుసుకున్నారు. ఆలయ సందర్శన అనిర్వచనీయమని పేర్కొన్నారు.





# సివిల్ సప్లై అధికారుల దాడులు 15 సిలిండర్ల స్వాధీనం

రామకృష్ణాపూర్ మార్చి 18 (వాయిస్ టుడే) : పట్టణంలో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారన్న ఫిర్యాదుల మేరకు మంచిర్యాల్ అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి వేణుగోపాల్, సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ పోచయ్య, సివిల్ సప్లై డి.టి ఎన్ అంజయ్య, సివిల్ సప్లై ఇన్స్పెక్టర్లు మురళీకృష్ణ, భూమేష్ లు మంగళవారం సాయంత్రం పట్టణంలోని బి.జోన్ ఏరియాలోని హోటళ్ల పై దాడులు నిర్వహించారు. మొత్తం 15 సిలిండర్లను స్వాధీనం చేసుకొని గ్యాస్ ఏజెన్సీలకు అప్పగించి 6 (ఎ )కేసు నమోదు చేసి జాయింట్ కలెక్టర్ కు నివేదిక ఇస్తామని సివిల్ సప్లై అధికారులు తెలిపారు.





# యాదగిరిగుట్ట దుర్గమ్మ పోచమ్మ తల్లి దేవయంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

వాయిస్ టుడే/ యాదగిరిగుట్ట న్యూ గుండ్లపల్లి బోనాల పండగ సంబరాలు జరుపుకుంటున్నా రు న్యూ గుల్లపల్లిలో పోచమ్మ తల్లి బోనాలు జరిగినవి దుర్గమ్మ కి గత సంవత్సరం కింద ఒకసారి జరిగినది ఇది రెండోసారి బోనాల పండుగ జరుపుకుంటున్నారు. బోనాల సందడితో డప్పు సప్పులతో ఇంటింటా ఆడపడుచుల సందడి ఇంటింటా బోనం చేసి బోనాలను ఘనంగా ఎత్తుకెళ్లిస్తున్నారు. అమ్మవారు అందరికీ ఊరంతా చల్లగా చూడాలని అమ్మ గారి ఆశీస్సులతో ఘనంగా జరుపుకుంటున్న బోనాల పండుగ

# విప్లవ ధృవతార మల్లు స్వరాజ్యం



(సేకరణ ,:ఏనుగుల వీరాంజనేయులు
సీనియర్ జర్నలిస్ట్. 9951969008)

**మార్చి 19న (నేడు )తృతీయ వర్ధంతి**

బంధూకు చేతబట్టి భూస్వాములను నైజాం రజాకార్లను తరిమికొట్టిన వీరవనిత విప్లవ ధృవతార కామ్రేడ్ మల్లు స్వరాజ్యం.ఆమె (ఉమ్మడి నల్లగొండ జిల్లా) సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం కరివిరాల కొత్తగూడెం గ్రామంలో ఓ భూస్వామ్య కుటుంబంలో 1931లో భీంరెడ్డి రాంరెడ్డి చుక్కమ్మలకు జన్మించారు. "పువ్వు పుట్టగానే పరిమళించు" అన్నట్లు ఆమె చిన్ననాడే పోరాట పంథాను ఎంచుకున్నారు.11 సం?రాల వయస్సులో ఆమె తండ్రి చనిపోయాడు.అక్క శశికళ కూడా పోరాటంలో 3 సం?రాలు జైలు జీవితం గడిపారు.స్వరాజ్యం తల్లి చుక్కమ్మ గొప్ప సామ్యవాది.తన కుటుంబం అంతా నేటికి విప్లవ రాజకీయాలతో పెనవేసుకొని ఉన్నది.నాడు చెక్క పలకలపై ఇసుకలో ఓనమాలు దిద్దుకొని క్రమంగా 5వ తరగతి వరకు విద్యను అభ్యసించారు. చిన్నతనంలో కమ్యూనిష్టు భావాలు అలవర్చుకొని దోపిడీకి వ్యతిరేకంగా,తన సొంత గ్రామంలో గ్రామ పటేళ్ళను,పెత్తందార్లను ఎదిరించి పాలేర్ల సంఘం పెట్టి కూలిరేట్ల ఉద్యమంతో ప్రారంభమైన ఆమె విప్లవ జీవితం 8 దశాబ్దాల పాటు ఏనాడు వెనుదిరగలేదు. విప్లవమే జీవితంగా భావించి ఎన్ని కష్టాలు నష్టాలు వచ్చినా ఆమె పోరాటాలకు తట్టుకోలేక సొంత ఇంటిని ధ్వంసం చేసినా, స్వరాజ్యంను పట్టుకుంటే నాటి ప్రభుత్వం బహుమతులు కూడా ప్రకటించినా మొక్కవోని ధైర్యంతో తన అన్న భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి (బి.యన్.) అడుగు జాడల్లో పోరాటాల్లోకి వచ్చిన స్వరాజ్యం ఏనాడు మడమ తిప్పలేదు.పోరాటమే ఆయుధంగా గెరిల్లా దళాల్లో చేరి దొరల దుర్మార్గాలను ఎదుర్కొంటూ నైజాం రజాకార్ల పోలీసులకు ముచ్చెమటలు పట్టించిన వీరవనిత మల్లు స్వరాజ్యం,విప్లవోద్యమంలో తనదైన ముద్ర వేసుకొని అలుపెరగని పోరాట యోధురాలుగా "ఆమె మాటే తుపాకి తూటాల" తనదైన పాత్ర పోషించిన ఆమె పోరాటం చిరస్మరణీయం.ఆ పోరాట ఘట్టాలు నాటికి,నేటికి ఎప్పటికి ప్రజల మదిలో స్ఫురిస్తూనే ఉంటాయి.

తెలంగాణలో భూమికోసం, భుక్తికోసం,వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన వీరతెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆమె ముఖ్య భూమిక పోషించారు.తెలంగాణలో వెట్టిచాకిరి రద్దు చేయాలని,దున్నేవానికి భూమి కావాలని,నైజాం నవాబు గద్దె దిగాలనే నినాదాలతో సాగిన మహత్తర సాయుధ పోరాటం,ప్రపంచ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించ దగిన పోరాటం.ఆ సాయుధ పోరాట ఫలితంగా తెలంగాణలో 3వేల గ్రామాల్లో గ్రామ రాజ్యాలు ఏర్పడ్డాయి.4 వేల మంది వీరమరణం పొందారు.10 లక్షల ఎకరాల భూములు పేదలకు పంపిణీ చేయబడింది.భూస్వాముల భూములు,గఢీలు ప్రజల స్వాధీనమైనవి.వెట్టిచాకిరీ రద్దయింది.వడ్డీ వ్యాపారం అక్రమ భేదాఖళ్ళు నిలిపి వేయబడ్డాయి.వ్యవసాయ కూలిరేట్లు పెంచ బడ్డాయి.గ్రామాలను గ్రామ రైతు కమిటీలు పరిపాలించారు.నైజాం రజాకార్ల బారి నుండి రైతాంగాన్ని రక్షించుకొనేందుకు 10 వేల మంది గ్రామరక్షక దళాలు 2 వేల మంది గెరిల్లా సాయుధ దళాలు నిర్మించారు. ఫలితంగా సాగిన పోరాటంలో మధ్యయుగాల నాటి నైజాం నవాబు పాలన అంతమొందింది. కమ్యూనిస్టుల నాయకత్వాన సాగిన సాయుధ రైతాంగ పోరాటం అనేక విజయాలు సాధించింది.ఫలితంగా దేశవ్యాప్తంగా భూసంస్కరణ చట్టం వచ్చింది,కౌలుదారి చట్టం వచ్చింది,పౌర హక్కులు వచ్చాయి,ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు వచ్చాయి.ఈ చారిత్రక పోరాటంలో స్వరాజ్యం పాత్ర అద్వీతీయం అజరామం. ఎర్రజెండానే ఊపిరిగా, పోరాటమే ఆయుధంగా 1945, 1948 సంవత్సరాలలో సాగిన వీరోచిత రైతాంగ పోరాటంలో ఆమె కీలక పాత్ర పోషించారు. నైజాం సర్కారును గడగడ లాడించిన ధీశాలి కా?మల్లు స్వరాజ్యం గారు.ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు ఆదిలాబాద్, కరీంనగర్,వరంగల్ జిల్లాల్లో దళ కమాండర్ గా పనిచేసారు.గోదావరి అడవుల్లో 3 సం?రాల పాటు పనిచేసారు.ఆమె మొదట జోన్ కార్యకర్తగా ఆ తర్వాత ప్రాంతీయ కమిటీ సభ్యురాలుగా,గుండాల కేంద్రంలో కోయలను ఉత్తేజ పరిచి వారికి నాయకత్వం వహించి పోరాటాలలోకి దింపింది స్వరాజ్యం గారు. భూస్వామ్య కుటుంబం నుండి వచ్చినప్పటికీ అణగారిన వర్గాల్లోకి,వ్యవసాయ కార్మికుల్లోకి చొచ్చుకొని పోయి వారిలో ఒకరిగా ప్రజలతో మమేకమయ్యే లక్షణం కలిగి ఉండేది.తదనంతరం మార్క్సిస్టు పార్టీ ఉద్యమంలో కీలకమైన బాధ్యత నిర్వహిస్తు తుంగతుర్తి శాసన సభ్యురాలిగా,పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలిగా,మహిళా సంఘం ఉమ్మడి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ అనేక పోరాటల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు ఆమె గొంతేతితే భూస్వామి పాలకవర్గాలకు గడపుట్టేది మల్లు స్వరాజ్యం వ్యక్తి కాదు ఆమె ఒక మహాశక్తి,ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మార్క్సిస్టు పార్టీ ఉద్యమానికి అండదండలు ఇచ్చి, కార్యకర్తలను అక్కున చేర్చుకొని కాపాడటంలో ఎనలేని కృషి చేసారు. ఆమె జీవితం నేటి తరానికి ఆదర్శం మార్క్సిస్టు పార్టీ ఉద్యమంపై, కార్యకర్తలపై నాడు పాలకపార్టీ గుండాలు హత్యల పరంపర కొనసాగుతున్న రోజుల్లో మండే కొలిమిలా మార్క్సిస్టు ఉద్యమంపై దాడులు జరుగుతున్నప్పుడు కార్యకర్తలకు అండగా నిలబడి ధైర్యాన్ని ఇచ్చిన ఘనత కా?బి.యన్.,కా?స్వరాజ్యం గార్ల పాత్ర వెలకట్ట లేనిది.

మిర్యాలగూడెం ప్రాంతంలో రాగిరెడ్డి వీరారెడ్డి,గాదె శ్రీనివాసరెడ్డి,పానుగోడులో అందె నర్సయ్య,సుందరి బసవయ్య, మల్లారెడ్డిగూడెం కందుల గుర్వారెడ్డి,వెంకటేశ్వర్ రెడ్డి,యాతవాకిళ్ళలో పున్నంరాజు,మునగాలలో ముదిరెడ్డి ఆదిరెడ్డి, సూర్యాపేటలో ధనియాకుల గుర్వయ్య హత్యలతో పాటు సూర్యాపేట,తుంగతుర్తి, పుట్టపాక లాంటి అనేక గ్రామాల్లో,ఉద్యమ కేంద్రాల పైన దాడులు జరిగినప్పుడు ఆ కేంద్రాలకు అండనిచ్చి వారి కుటుంబాలకు మనోధైర్యాలను నింపటంలో ఆమె నిర్వహించిన పాత్ర అద్వీతీయం.

పాలకపార్టీల అండతో పోలీసులు ఉద్యమ కేంద్రాలపై దాడులు చేసినప్పుడు,పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి,చిత్రహింసలకు గురిచేసినప్పుడల్లా ఆమె గళమెత్తితే పాలక వర్గాలకు, పోలీసులకు లాగు తడిచేది. స్వరాజ్యం ఏ సభలో పాల్గొన్నా,ఆమె ప్రసంగం కోసం ప్రజలు గంటల తరబడి ఎదురు చూసేవారు,కేరింతలు కొట్టే వారు

ఉమ్మడి నల్లగొండ జిల్లాను సమగ్రా అభివృద్ధి చేయాలని సాగు,త్రాగునీరు,ఫ్లోరైడ్ నివారణ కోసం నిరంతరం ఆమె గళాన్ని శాసనసభలో ప్రజాపోరాటాల్లో తన వాణిని వినిపించేది.1978లో, 1983లో రెండు పర్యాయాలు తుంగతుర్తి ఎం.ఎల్.ఏ.గా గెలిచి తుంగతుర్తితో పాటు జిల్లా సమగ్ర అభివృద్ధికై పోరాటాలు నిర్వహించిన చరిత్ర ఆమెది. తుంగతుర్తి ప్రాంతానికి యస్.ఆర్.ఎస్.పి. సమరశీల పోరాటాల ద్వారా సాగు,త్రాగు నీటి కోసం నిరంతరం పోరాటం చేసి విజయం సాధించిన ఘనత కమ్యూనిస్టులదే.తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో జూనియర్ కళాశాలతో పాటు, రోడ్లు, విద్య,వైద్యం సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చి అభివృద్ధి ప్రధాతగా పేరు తెచ్చుకున్నారు.ఉమ్మడి నల్లగొండ జిల్లాలో శ్రీశైల సొరంగ మార్గం నుండి ఏ.యం.ఆర్.పి.ప్రాజెక్టు ద్వారా హైద్రాబాద్ త్రాగునీరు, నల్లగొండ జిల్లాకు సాగు, త్రాగునీరు శాశ్వత పరిష్కారం సాధించిన ఘనత కమ్యూనిస్టులదే,జిల్లా అభివృద్ధిలోను,ప్రజా పోరాటాల్లోను మల్లు వెంకట నర్సింహ్మారెడ్డి, బి.యన్.,స్వరాజ్యం గార్లు జిల్లా అభివృద్ధిపై చెరగని ముద్ర వేశారు.

ఆమె జీవితం అంతా పోరాటాల మయం,ఆమె త్యాగం వెలకట్ట లేనిది,ఆమె చరిత్ర విప్లవోద్యమాలకు పూలబాట,ఆమె పరిపూర్ణమైన విప్లవ జీవితం గడిపారు. భూస్వామ్య వర్గంలో పుట్టినా పీడిత వర్గాలకోసం తుదిశ్వాస వరకు పని చేశారు. ఆమె చరిత్ర పాఠ్యపుస్తకాల్లో లిఖించబడ్డది.తెలంగాణలో ప్రజారాజ్య స్థాపనే ఆమె లక్ష్యం,ప్రజా పోరాటాలను నిర్మిద్దాం - మల్లు స్వరాజ్యం ఆశయాలను సాధిద్దాం. ఇదే ఆమెకు మనమిచ్చే ఘనమైన నివాళి.తేదీ 19, మార్చి 2025 న ప్రజాఉద్యమాల కేంద్రమైన సూర్యాపేట జిల్లా కేంద్రంలో సూర్యాపేట ఎం వి ఎన్ భవనం లో తృతీయ వర్ధంతి సభ సందర్భంగా రైతాంగ సమస్యలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలు పై సెమినా జరుగుతున్నది ఈ యొక్క సెమినార్ కు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు హాజరవుతున్నారు .ఈ సెమినార్ కు అధిక సంఖ్యలో ప్రజలు. పాల్గొనాలని విజ్ఞప్తి... మత తత్వ రాజకీయాలు ఓడిద్దాం రైతాంగ ప్రజా ఉద్యమాలు నిర్మిద్దాం స్వరాజ్యం గారి ఆశయ సాధన కోసం మనందరం పునరంకిత మవుదాం, ఇవే స్వరాజ్యం కి మనం ఇచ్చే ఘనమైన నివాళి.